ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తమిళనాడు

TAMILNADU

శనివారం 20 జనవరి 2024

చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ప్రధాని నరేంద్ర మోదీకి ఆహ్వానం పలుకుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్





ఖేలో ఇండియా పోటీలను ప్రారంభిస్తున్న ప్రధానమంత్రి మోదీ, సీఎం స్టాలిన్ తదితరులు

అథ్లెట్లకు తమిళనాడే స్ఫూర్తి

- ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు ప్రత్యేకం
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ
- 'ఖేలో ఇండియా' యువజన క్రీడా ఉత్సవాలు' ప్రారంభం
- రాష్ట్రాన్ని క్రీడారాజధానిగా తీర్చిదిద్దుతాం
- ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశ క్రీడలకు తమిళనాడు అందిస్తున్న సహకారం అసామాన్యమని, ఇక్కడి టెన్నిస్ ఛాంపియన్లు అమృతరాజ్ బ్రదర్స్, ఒలంపిక్స్‌లో భారత్‌కు పతకాన్ని అందించిన భారత హాకీ కెప్టెన్ భాస్కరన్, చెస్ క్రీడాకారులు విశ్వనాథన్ ఆనంద్, ప్రజ్ఞానంద వంటి వారి వల్ల అథ్లెట్లకు తమిళనాడు స్ఫూర్తిగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. అందమైన తమిళభాష, రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలు, వంటకాలు క్రీడాకారులకు ఇంటి అనుభూతిని కలిగిస్తాయన్నారు. తమిళనాడు ఆతిథ్యం అందరి హృదయాలను గెలుచుకుంటుందని, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నైపుణ్యాలను ప్రదర్శించే అవకాశాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడ ఏర్పడిన కొత్త స్నేహాలు జీవితాంతం గుర్తుంటాయని వ్యాఖ్యానించారు. శుక్రవారం సాయంత్రం ప్రధానమంత్రి స్థానిక నెహ్రూ స్టేడియంలో 'ఖేలో ఇండియా' యువజన క్రీడోత్సవాలను ప్రారంభించి ప్రసంగించారు.

అట్టహాసంగా ప్రారంభోత్సవం...

ఖేలో ఇండియా యువజన పోటీలు 2023 ప్రారంభోత్సవాలు నెహ్రూ ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ సంగీత విదుషీమణులు సుధా రఘునాథన్, నిత్యశ్రీ అందించిన గానానికి తమిళ సంస్కృతిని చాటేలా కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించాయి. భారతావని స్వర్ణాలే క్రీడా సింహాలే అంటూ తమిళంలో చేసిన ఆ గానం కూడా మైమరపించింది. అటుపిమ్మట చల్ ఖేల్ అనే హిందీపాట కలిగిన వీడియోను కూడా ప్రదర్శించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా ప్రారంభోత్సవం ముగిసిన అనంతరం ప్రధాని మోదీ.. రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధిని భుజం తట్టి మరీ ప్రత్యేకంగా అభినందించడం విశేషం. కాగా అంతకుముందు స్టేడియం వద్దకు వచ్చిన ప్రధానికి బీజేపీ కార్యకర్తలు, కళాకారులు, క్రీడాకారులు అపూర్వస్వాగతం పలికారు. గానబజానాలు, పుష్ప వర్షంతో ఆయనకు అరుదైన ఆహ్వానం పలికారు. కార్యక్రమం ముగిసిన అనంతరం రాజ్‌భవన్‌కు వెళ్లిన ప్రధాని... అక్కడే బస చేశారు. శనివారం ఉదయం ఆయన ప్రత్యేక విమానంలో తిరుచ్చి వెళ్లి, అక్కడి శ్రీరంగ నాథుని దర్శించుకోనున్నారు.

క్రీడలకు అగ్రతాంబూలం...

రాష్ట్రప్రభుత్వం గత మూడేళ్లుగా క్రీడలకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తోందని రాష్ట్ర యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి అన్నారు. ఖేలో ఇండియా పోటీల ప్రారంభోత్సవ సభలో ఆయన స్వాగతోపన్యాసం చేస్తూ ఈ పోటీలు కొత్త చరిత్రను సృష్టించడం ఖాయమన్నారు. చెస్ ఒలంపియాడ్‌ను నిర్వహించినప్పటి నుంచి రాష్ట్రం క్రీడల నిర్వహణలో అంతర్జాతీయ ఖ్యాతిని గడిస్తోందని చెప్పారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా కలైంజర్ శతజయంతి ముగింపు వేడుకల సందర్భంగా రాష్ట్ర మంతటా జాతీయ స్థాయిని తలపించేలా క్రీడాపోటీలు జరిపామని చెప్పారు. ఆ దిశగానే కలైంజర్ శతజయంతి ముగింపువేడుకల సందర్భంగా క్రీడాకారులకు లక్షలాది రూపాయల విలువైన క్రీడా సామగ్రి పంపిణీ చేశామన్నారు. ఆర్థికపరంగా వెనుకబడి ఉన్న క్రీడాకారులకు సాయం అందజేసి ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

సమైక్యతకు క్రీడలు దోహదం

ముఖ్యమంత్రి స్టాలిన్

అందరికీ అభివృద్ధి ఫలాలు, అన్ని జిల్లాల్లో సమగ్రాభివృద్ధి, అందరికీ సమాన న్యాయం అంటూ ద్రావిడ తరహా పాలన అందిస్తున్న తమ ప్రభుత్వం రాష్ట్రాన్ని క్రీడారాజధానిగా తీర్చిదిద్దాలని సంకల్పించిందని సీఎం ఎంకే స్టాలిన్ అన్నారు. ఖేలో ఇండియా యువజన క్రీడోత్సవాల ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగిస్తూ గత మూడేళ్ల పాలనలో తమ ప్రభుత్వం 44వ చెస్ ఒలంపియాడ్ పోటీలు, స్క్వాష్ వరల్డ్ కప్ 2023, గ్రాండ్ మాస్టర్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలను సమర్థవంతంగా నిర్వహించి అంతర్జాతీయపరంగా పేరు ప్రఖ్యాతులు గడించిందని చెప్పారు. క్రీడలు ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని, అదే సమయంలో భాషా ప్రాంతీయత అనే సరిహద్దులు చెరిగి సమైక్యతను స్థాపిస్తుందన్నారు. తమ ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్య ఇస్తోందని, ఆ దిశగానే దేశంలోనే తొట్టతొలుతగా పారాలింపిక్ క్రీడాకారుల కోసం ఆరు క్రీడా మైదానాలు, రామనాథపురంలో ఒలంపిక్ వాటర్ గేమ్స్ స్టేడియం, చెన్నై, మదురై, తిరుచ్చి, నీలగిరిలో ఒలంపిక్ అకాడమీ, 10 శాసనసభ నియోజకవర్గాలలో మినీ స్టేడియంలు నిర్మించే పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. ఇక తమిళుల ప్రాచీన సాహసక్రీడ జల్లికట్టు కోసం మదురైలో రూ.62.77 వ్యయంతో నిర్మించిన కలైంజర్ జల్లికట్టు స్టేడియంను ఈ నెల 24న తాను ప్రారంభించనున్నామని తెలిపారు. ఇటీవల మణిపూర్‌కు చెందిన క్రీడాకారులకు కూడా తమ ప్రభుత్వం సునిశిత శిక్షణలందించామని, ఆ క్రీడాకారులు ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొననుండటం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఖేలో ఇండియా పోటీలను నిర్వహించే బాధ్యతలు చేపట్టిన క్రీడా శాఖ మంత్రి ఉదయనిధికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చెప్పారు. అదే విధంగా తమ ఆహ్వానాన్ని మన్నించి ఈ వేడుకలను ప్రారంభించేందుకు విచ్చేసిన ప్రధాని మోదీకి కూడా ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని పేర్కొన్నారు.







ప్రధాని చిత్రపటంతో కూడిన ప్ల కార్డులతో వేచి ఉన్న మహిళలు - బీజేపీ పతాకాలతో ప్రధానికి స్వాగతం పలికేందుకు వేచి ఉన్న కార్యకర్తలు - 'ఖేలో ఇండియా' ట్రోఫీల నమూనాలతో క్రీడాకారుల స్వాగతం



నెహ్రూ స్టేడియానికి వస్తున్న ప్రధాని కాన్వాయ్



వాహనం నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ



బడ్జెట్ తయారీపై కసరత్తు

- మంత్రులు, అధికారుల సమావేశం
- 23న రాష్ట్ర మంత్రివర్గ భేటి
- మంత్రి తంగం తెన్నరసు

అడయార్, జనవరి 19: రాష్ట్రప్రభుత్వ 2024-25వ వార్షిక బడ్జెట్ తయారీపై శాఖల వారీగా మంత్రులు, అధికారులతో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం అధికారంలో వచ్చినప్పటి నుంచి అసెంబ్లీలో సాధారణ, వ్యవసాయ బడ్జెట్లు దాఖలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చే నెల ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు జనరల్ బడ్జెట్‌ను, వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం దాఖలు చేయనున్నారు. వార్షిక బడ్జెట్‌లో పొందుపరచాల్సిన అంశాలు, పథకాలు, కేటాయించాల్సిన నిధులు తదితరాలపై సచివాలయంలో గురువారం నుంచి శాఖల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు నిర్వహించిన పరిశ్రమల శాఖ సమావేశంలో ఆ శాఖ మంత్రి టీఆర్బీ రాజా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనగా, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి టీఎం అన్బరసన్, అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వచ్చే నెల ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో అన్ని శాఖల తరపున దాఖలు చేసే పద్దులపై లోక్‌సభ ఎన్నికల అనంతరం చర్చలు జరిగే అవకాశముందని సచివాలయ వర్గాలు తెలిపాయి.

23న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 23న జరగనుంది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సారథ్యంలో సచివాలయంలో ఈ కేబినెట్ మీటింగ్ జరుగుతుందని ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొంది. సాధారణంగా యేటా కొత్త సంవత్సరం ఆరంభమైన తర్వాత జనవరిలో రాష్ట్ర శాసనసభ సమావేశాలను నిర్వహించడం ఆనవాయితీ. అయితే, ఈ దఫా జనవరిలో ఈ అసెంబ్లీ సమావేశాలను నిర్వహించలేకపోయారు. దీనికి అనేక కారణాలు లేకపోలేదు. జనవరి నెలలో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు, ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటన, సీఎం స్టాలిన్ విదేశీ పర్యటనకు వెళ్లనుండడం... ఇలా అనేక కారణాలతో ఈ సమావేశాలను నిర్వహించలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఈ నెల 23వ తేదీన ఉదయం 11 గంటలకు సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సారథ్యంలో మంత్రివర్గ సమావేశం జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. ఈ సమావేశంలో మంత్రులందరూ పాల్గొనున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర శాసనసభలో చర్చించాల్సిన అంశాలతో పాటు గవర్నర్ ప్రసంగ పాఠం తదితర అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే, సీఎం స్టాలిన్ ఈ నెల 28వ తేదీన విదేశీ పర్యటనకు వెళ్లి, ఫిబ్రవరి మొదటి వారంలో చెన్నైకి తిరిగిరానున్నారు. దీంతో శాసనసభ సమావేశాలు రెండో వారంలో నిర్వహించే అవకాశాలు ఉండొచ్చని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అదే సమయంలో సీఎం విదేశీ పర్యటనలో పలువురు పెట్టుబడిదారులను కలుసుకుని, రాష్ట్రంలో పెట్టుబడులను పెట్టే అంశంపై చర్చించడమే కాకుండా, పలువురు పారిశ్రామికవేత్తలతో పలు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

అన్నాడీఎంకేలో చేరిన నటి గాయత్రి రఘురాం



గాయత్రి రఘురాంను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పళనిస్వామి

పెరంబూర్, జనవరి 19: గత ఏడాది బీజేపీ నుంచి వైదొలిగిన నటి గాయత్రి రఘురాం... ఎట్టకేలకు ఎడప్పాడి పళనిస్వామి సమక్షంలో అన్నాడీఎంకేలో చేరారు. బీజేపీలో గాయత్రి రఘురాం రాష్ట్ర బీజేపీ విదేశీ, పొరుగు రాష్ట్రాల తమిళుల సంక్షేమ విభాగం అధ్యక్షురాలిగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో గత ఏడాది జనవరిలో తన మనసు నొప్పించారంటూ బీజేపీ నుంచి వైదొలిగారు. ఆ పార్టీలో మహిళలకు మర్యాద, సమాన హోదా లేదని ఆమె ఆరోపించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైపై పలు ఆరోపణలు చేస్తూ వచ్చిన గాయత్రి రఘురాం శుక్రవారం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో ఆ పార్టీలో చేరారు. ఈపీఎస్‌తో గాయత్రి రఘురాం భేటీ అయిన చిత్రాలను పార్టీ అధికార ప్రతినిధి సీఆర్టీ నిర్మల్ కుమార్ తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

పళని ఆలయంలో తైపూస ఉత్సవాలు ప్రారంభం




ధ్వజారోహణం సందర్భంగా కొలువుదీరిన వళ్ళి, దేవసేన సమేత కుమారస్వామి ఇన్‌సెట్‌లో ధ్వజారోహణ దృశ్యం

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కుమారస్వామి కొలువైన ఆరు దివ్య క్షేత్రాల్లో తృతీయ క్షేత్రంగా కీర్తిగడించిన పళని దండాయుధపాణి ఆలయ తైపూస ఉత్సవాలు శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వ్రతమాచరించి పాదయాత్రగా చేరుకుంటారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఆలయంలోని పెరియ నాయకి అమ్మన్ ఆలయంలో ధ్వజారోహణంతో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేకువజాము 4గంటలకు ఆలయాన్ని తెరచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7గంటలకు వినాయకుడి పూజ, పుణ్యాహ వాచనం, ముత్తుకుమారస్వామి, వళ్లీ, దేవసేనకు ప్రత్యేక అభిషేకాలు, అలంకారం నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు పతాక పూజ, వాద్యపూజ జరిపారు. అటుపిమ్మట శైవాగమ పండితులు మంత్రోచ్చాటనలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధానార్చకులు ధ్వజారోహణం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు తిరుఆవినన్‌కుడి, పర్వతాలయంలోని వినాయక స్వామి, మూలవర్ షణ్ముఖులు, ఉత్సవమూర్తి, ద్వారపాలకులు, వాహనాలకు కంకణధారణ జరిగాయి. ఈ వేడుకల్లో ప్రతి రోజూ ఉదయం దంతపల్లకీలో ముత్తుకుమారస్వామి ఊరేగనున్నారు. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో రజత మేషవాహనం, కామధేను వాహనం, స్వర్ణమయూర వాహనం, స్వర్ణాశ్వం తదితర వాహనాలలో స్వామివారి ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. 24న తిరుకళ్యాణం, 25న రథోత్సవం జరుగుతాయి.

మళ్లీ సుప్రీంకోర్టులో ఓపీఎస్‌కు చుక్కెదురు

- సర్వసభ్యమండలి వ్యతిరేక అప్పీలు తోసివేత



చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్)కు సుప్రీంకోర్టులో మళ్లీ చుక్కెదురైంది. అన్నాడీఎంకేలో ఏక నాయకత్వాన్ని సమర్థిస్తూ, పార్టీ సమన్వయకర్త పదవి నుంచి తనను తొలగిస్తూ పార్టీ సర్వసభ్యమండలిలో చేసిన తీర్మానాలకు వ్యతిరేకంగా ఆయన దాఖలు చేసిన అప్పీలు పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అన్నాడీఎంకే సర్వసభ్యమండలి సమావేశం 2022 జూలై 11న జరగ్గా, ఆ సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామిని పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడంతో పాటు పార్టీ సమన్వయకర్తగా ఉన్న ఓపీఎస్‌ను ఆ పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. అదే సమయంలో పార్టీ నియమ నిబంధనలను సవరిస్తూ కొన్ని తీర్మానాలు ప్రతిపాదించి ఆమోదించారు. ఆ నేపథ్యంలో సర్వసభ్యమండలి తీర్మానాలను వ్యతిరేకిస్తూ ఓపీఎస్, ఆయన అనుచరులు వైద్యలింగం, మనోజ్ పాండ్యన్, జేసీడీ ప్రభాకర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి దాన్ని తోసిపుచ్చారు. అన్నాడీఎంకే సర్వసభ్య మండలి సమావేశం తీర్మానాలు సమంజసమేనని ప్రకటించారు. సింగిల్ జడ్జి తీర్పును వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన అప్పీలును హైకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ తీర్పును కూడా వ్యతిరేకిస్తూ ఓపీఎస్ వర్గం సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలు చేసింది. ఆ అప్పీలుపై న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. ఆ సందర్భంగా ఓపీఎస్ వర్గం తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అన్నాడీఎంకేలో పార్టీ ప్రాథమిక సభ్యత్వం కలిగినవారంతా కలిసి ప్రధాన కార్యదర్శిని ఎన్నుకోవడం ఆనవాయితీగా ఉంటోందని, అయితే పార్టీ నియమావళిని సవరించి ఈపీఎస్‌ను ఆ పదవికి ఎంపిక చేయడం న్యాయసమ్మతం కాదని పేర్కొన్నారు. అంతేకాకుండా పార్టీ సమన్వయకర్తగా ఉన్న తనను అకారణంగా పదవి నుండి తొలగించడం సరైన చర్య కాదని ఓపీఎస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా స్పందిస్తూ పార్టీలో సర్వసభ్యమండలికే సర్వాధికారాలు ఉన్నాయని, కనుక ఆ మండలి చేసిన తీర్మానంపై ఎలా స్టే విధించగలమని ప్రశ్నించారు. సర్వసభ్యమండలి వివాదానికి సంబంధించి ప్రధానమైన కేసు విచారణ పెండింగ్‌లో ఉండటంతో తాము ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేమని పేర్కొంటూ అప్పీలు పిటిషన్ తోసిపుచ్చారు. ఈ వివాదానికి సంబంధించిన ప్రధానమైన కేసు విచారణను వీలైనంత త్వరగా ముగించాలని ఆదేశించారు.

సమాచార ధ్వని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జనవరి 19: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ తెలిపిన ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈబీ తెలిపింది.
పోరూర్: పెరియపనిచ్చేరి, సిక్కరాయపురం, తండలం, మనంజేరి, బాబు గార్డెన్, ఆకాష్ నగర్, కుమరన్ నగర్, మెహతా నగర్, కుంద్రత్తూర్.
అంబత్తూర్: తిరువేర్కాడు కేంద్రవిహార్, ఇండస్ట్రియల్ మేఘన ఎస్టేట్, నూంబల్ పీహెచ్ రోడ్డు, పల్లవన్ నగర్, ఎంజీఆర్ నగర్, పెరుమాళ్ అగరం, వడనూంబల్.
ఆవడి: తిరుముల్లైవాయల్ శివశంకరా పురం, జాక్ నగర్, తెండ్రల్‌నగర్, పద్మావతి నగర్, మూర్తినగర్.

22న పుదుచ్చేరికి సెలవు
● సీఎం రంగస్వామి

పుదుచ్చేరి, జనవరి 19: అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఈ నెల 22న పుదుచ్చేరికి సెలవు ప్రకటిస్తూ సీఎం ఎన్.రంగస్వామి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం కేంద్రప్రభుత్వ కార్యాలయాలకు మధ్యాహ్నం 2.30 గంటల వరకు సెలవు ప్రకటించింది. అలాగే, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర బీజేపీ నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వాలు 22వ తేది సెలవురోజుగా ప్రకటించాయి. ఈ నేపథ్యంలో, సీఎం కూడా రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని టీవీ ఛానళ్లలో వీక్షించేలా రాష్ట్రప్రజలకు అవకాశం కల్పిస్తూ సెలవు దినంగా ప్రకటించారు.

నేడు యథావిధిగా పాఠశాలలు

పెరంబూర్, జనవరి 19: చెన్నై, తిరువళ్లూర్ జిల్లాల్లో శనివారం యథావిధిగా పాఠశాలలు పనిచేస్తాయని ఆయా జిల్లాల పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. మిచౌంగ్ కారణంగా ఈ జిల్లాల్లో ప్రకటించిన సెలవులు భర్తీ చేసేలా శనివారం (ఈనెల 20వ తేది) పాఠశాలలు పనిచేస్తాయని అధికారులు తెలిపారు.

చదురగిరికి భక్తుల అనుమతి

పెరంబూర్, జనవరి 19: పశ్చిమ కనుమల కొండ ప్రాంతంలో ఉన్న చదురగిరి సుందర మహాలింగం ఆలయానికి త్రైమాసం ప్రదోషం, పౌర్ణమి సందర్భంగా ఈనెల 23 నుంచి 26వ తేది వరకు నాలుగు రోజులు భక్తులను అనుమతించనున్నట్లు అటవీ శాఖ, ఆలయ అధికారులు ప్రకటించారు. భక్తులు ఆలయ కొండ మార్గంలోనే వెళ్లాలని, రాత్రి వేళల్లో ఆలయ ప్రాంగణంలో బస చేయడం, జలపాతాల వద్ద స్నానాలను నిషేధిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కిళంబాక్కంలో ప్రీ పెయిడ్ ఆటో సేవలు ప్రారంభం

ఐసిఎఫ్, జనవరి 19: కిళంబాక్కం బస్ టెర్మినల్‌లో ప్రీ పెయిడ్ ఆటో సేవలు ప్రారంభమయ్యాయి. ఈ టెర్మినల్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రీ పెయిడ్ ఆటో సేవలు ప్రారంభించేందుకు అనుమతివ్వాలని ఆటో కార్మిక సంఘాలు కోరాయి. ఆ సంఘాల విజ్ఞప్తి మేరకు సీఎండీఏ అనుమతించింది. దీంతో ప్రీ పెయిడ్ ఆటో సేవల బుకింగ్ కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. కి.మీకు రూ.18 ఛార్జీని నిర్ణయించారు.

100 కొత్త బస్సులు

ఐసిఎఫ్, జనవరి 19: ప్రభుత్వ రవాణా సంస్థలకు శనివారం 100 కొత్త బస్సులు అందజేయనున్నారు. ఈ సంస్థల ఆధ్వర్యంలో 18,000 బస్సులు నడుస్తున్నాయి. ఇటీవల కొత్త బస్సులు కొనుగోలు ప్రారంభం కాగా, 100 బస్సులను సీఎం స్టాలిన్ శనివారం చెన్నై సెంట్రల్ సమీంపలోని పల్లవన్ హౌస్‌లో ప్రారంభించనున్నారు. ఈ బస్సులను కుంభకోణం, కోవై, విల్లుపురం ప్రభుత్వ రవాణా సంస్థలకు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

వర్కింగ్ ఉమెన్స్‌కు కాలేజీ హాస్టళ్లు

ఐసిఎఫ్, జనవరి 19: ఉద్యోగం చేసే మహిళలు బస చేసేందుకు అన్ని రాష్ట్రాల్లో ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలల ప్రాంగణాల్లో హాస్టళ్లు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వ వర్సిటీలు, కళాశాలలకు యూజీసీ కార్యదర్శి మనీష్‌జైన్ పంపిన లేఖలో... సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్, స్టెమ్ సెల్ విద్యను కేంద్ర ప్రభుత్వం పరిచయం చేసింది. ఈ విధానంలో డిగ్రీ పొందే వారిలో 43 శాతం మహిళలున్నారు. అన్ని శాఖల్లో పనిచేసే మహిళల శాతం 37కు చేరుకుంది. గ్రామాల నుంచి విద్య, ఉద్యోగం నిమిత్తం నగరాలకు వచ్చే మహిళల భద్రత కోసం వారికి అన్ని సదుపాయాలతో బస ఏర్పాటు చేయనున్నారు. 'శక్తి నివాస్' పేరుతో విశ్వవిద్యాలయాలు, కళాశాలల ప్రాంగణాల్లో వీరి కోసం హాస్టళ్లు ఏర్పాటు చేయనున్నారు.

నేడు మెట్రోవాటర్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, జనవరి 19: చెన్నై మెట్రోవాటర్ బోర్డు ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్ శనివారం జరగనుంది. ఒక్కో మండలంలో ఉన్న బోర్డు ప్రాంతీయ కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్‌లో ప్రజలు పాల్గొని తమ సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందాలని అధికారులు సూచించారు.

హరిత ఛాంపియన్ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జనవరి 19: పర్యావరణ భద్రతకు కృషి చేసే స్వచ్ఛ సేవకులు, సంస్థలు హరిత ఛాంపియన్ పురస్కారానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ప్రకటించింది. యేటా రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు 100 మందిని ఎంపిక చేసి తలా రూ.లక్ష నగదు, పురస్కారాలు అందిస్తోంది. 2023-24 సంవత్సరానికి పురస్కారానికి ఏప్రిల్ 15వ తేదీలోపు www.tnpcb.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

22 నుంచి నగర హోంగార్డు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జనవరి 19: గ్రేటర్ చెన్నై నగర హోంగార్డ్స్ విభాగంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 18 నుంచి 50 ఏళ్లలోపు, టెన్త్ పాస్/ఫెయిల్ అయిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. నగర సరిహద్దులకు చెందిన నేరారోపణలు లేని వారు అర్హులు. ఆసక్తి కలిగిన వారు సైదాపేటలోని గ్రేటర్ చెన్నై హోంగార్డ్స్ విభాగం ప్రధాన కార్యాలయంలో ఈనెల 22వ తేది నుంచి దరఖాస్తులు పొంది ఫిబ్రవరి 10వ తేది సాయంత్రం 5 గంటల్లోపు ప్రధాన కార్యాలయంలో నేరుగా గానీ పోస్టు ద్వారా పంపించాలి. మరిన్ని వివరాలకు నెం. 949813 5190, 9566776222లలో సంప్రదించవచ్చు.

25న మదురైలో ఏఐటీఎఫ్ ఆధ్వర్యంలో
తిరుమలనాయకర్ 441వ జయంతి


తిరుమలనాయకర్ జయంతి వేడుకల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఏఐటీఎఫ్ అధ్యక్షులు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి

ప్యారీస్, జనవరి 19: ఆలయాల నగరం మదురైలో అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటీఎఫ్) ఆధ్వర్యంలో తెలుగు మాతృభాష కలిగిన నాయకర్ వంశానికి చెందిన మహారాజు తిరుమలనాయకర్ 441వ జయంతి వేడుకలు ఈ నెల 25న నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఉదయం కీల్పాక్కంలోని ఏఐటీఎఫ్ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఉపాధ్యక్షులు డాక్టర్ సీఎం కిషోర్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎవర్‌గ్రీన్ బాలమురుగన్, మదురై జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు రాధాకృష్ణ, శివగంగ జిల్లా అధ్యక్షుడు చరణ్, టీ.ఎం.నాయుడు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఎంకే రెడ్డి మాట్లాడుతూ... 1623 నుంచి 1659వ సంవత్సరం వరకు మదురై కేంద్రంగా తిరుమల నాయకర్ ప్రభువు పరిపాలించారని తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో అద్భుత శిల్పకళా నైపుణ్యంతో నిర్మించిన ఆలయాలు, మదురై నాయకర్ మహల్ ఇప్పటికీ చెక్కుచెదర లేదన్నారు. వీటి ద్వారా హిందూ సంస్కృతికి కృషి చేశారని కొనియాడారు. ఈనెల 25న ఏఐటీఎఫ్ ఆధ్వర్యంలో మదురై బెతెన్యాపురం అన్నాగ్రౌండ్‌లో ఉదయం 10 గంటల నుంచి జరుపుకోనున్న తిరుమలనాయకర్ జయంతి వేడుకల్లో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన తెలుగు సంఘాల నాయకులు, సమరయోధుల వారసులు పాల్గొంటారని తెలిపారు.

30న కొడనాడు కేసు విచారణ
● హాజరుకానున్న ఈపీఎస్

పెరంబూర్, జనవరి 19: కొడనాడు హత్య, దోపిడీ కేసుకు సంబంధించి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ ఈ నెల 30,31 తేదీల్లో మాస్టర్ న్యాయస్థానంలో హాజరై సాక్ష్యం ఇస్తారని ఆయన తరపు న్యాయవాదులు మద్రాసు హైకోర్టుకు తెలిపారు. కొడనాడు కేసులో తనకు సంబంధాలున్నాయంటూ పేర్కొన్న ఢిల్లీకి చెందిన పాత్రికేయుడు మేథ్యూ సామువేలు, ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సయాన్, వాలైయార్ మనోజ్ తదితరులకు వ్యతిరేకంగా 2019లో పళనిస్వామి, రూ.1.10 కోట్ల పరువు నష్టం కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ కేసులో సాక్ష్యాలు నమోదు చేయాలని పేర్కొంటూ కేసు మాస్టర్ న్యాయస్థానానికి పంపుతూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, ఆ కేసులో కోర్టుకు స్వయంగా హాజరైన సాక్ష్యమిచ్చేందుకు ఈపీఎస్‌కు మినహాయింపు కల్పించిన న్యాయస్థానం, ఆయన ఇంటి వద్దకు వెళ్లి సాక్ష్యం నమోదు చేసేలా న్యాయవాది ఎస్.కార్తికైబాలన్‌ను నియమించింది. ఈ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ మాథ్యూ సామువేలు అప్పీలు పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ విచారించిన ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం, ఈ నెల 30, 31 తేదీల్లో మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో ఉన్న మాస్టర్ న్యాయస్థానానికి పళనిస్వామి హాజరై సాక్ష్యమివ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, ఈపీఎస్ దాఖలు చేసిన పిటిషన్ గురువారం న్యాయమూర్తి ఎస్.సతీష్‌కుమార్ విచారించగా, ఈపీఎస్ తరపున హాజరైన న్యాయవాది, హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఈనెల 30, 31 తేదీల్లో పళనిస్వామి మాస్టర్ న్యాయస్థానం ఎదుట హాజరైన సాక్ష్యమిస్తారని తెలిపారు. అనంతరం కేసు విచారణ ఫిబ్రవరి 8వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

వేలూరు, జనవరి 19: ఆంబూరు సమీపం నాయకనేరి కొండ గ్రామానికి చెందిన స్వామివేల్, జయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. ప్రస్తుతం నిండు గర్భిణిగా ఉన్న జయలక్ష్మి ప్రసవ నొప్పులు రావడంతో ఆసుపత్రికి వెళ్లేందుకు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో వచ్చిన సిబ్బంది, ఆమెను తీసుకొని ఆసుపత్రికి వెళ్లే సమయంలో మార్గమధ్యంలో నొప్పులు అధికమయ్యాయి. దీంతో, డ్రైవర్ రోడ్డు పక్కనే అంబులెన్స్ నిలుపగా, డాక్టర్ ఇస్మాయిల్ పర్యవేక్షణలో జయలక్ష్మి మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వారిని ఆంబతూరు సమీపంలోని మిన్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

రవాణా కార్మికుల చర్చలు వాయిదా

పెరంబూర్, జనవరి 19: రవాణా సంస్థ కార్మికులతో ప్రభుత్వం శుక్రవారం జరిపిన చర్చలు ఫిబ్రవరి 7వ తేదీకి వాయిదా పడ్డాయి. తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టిన రాష్ట్ర రవాణా సంస్థ కార్మిక సంఘాలు హైకోర్టు జోక్యంతో తాత్కాలికంగా విరమించుకున్నట్లు ప్రకటించాయి. అదే సమయంలో, సమస్యల పరిష్కారానికి కార్మిక సంఘాలతో చర్చలకు సిద్ధమని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో, స్థానిక అంబత్తూర్‌లోని తమిళనాడు విద్య భవన కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు రవాణా కార్మిక సంఘాల ప్రతినిధులతో ఆ శాఖ ఉన్నతాధికారులు, కార్మికుల సంక్షేమ శాఖ అధికారులు చర్చలు జరిపారు. తమ డిమాండ్లను కార్మిక సంఘాలు ప్రతినిధులు తెలియజేశారు. ఆ డిమాండ్లను రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని వారికి హామి ఇచ్చిన అధికారులు, తదుపరి చర్చలు ఫిబ్రవరి 7వ తేది జరుగుతాయని ప్రకటించారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

అడయార్, జనవరి 19: తిరుమంగళం సమీపంలోని ప్రముఖ హోటల్‌తో పాటు అనేక దుకాణాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. ఈ దుకాణాల్లో విక్రయించే ఆహార పదార్థాల నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. పట్టాభిరాంకు చెందిన నందకుమార్, అజయ్ అనే స్నేహితులు తిరుమంగళంలోని ఓ హోటల్‌లో చికెన్ బిర్యానీ ఆరగించిన కొద్ది సేపటికే అపస్మారకస్థితికి చేరుకున్నారు. దీంతో వారిద్దరిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అలాగే, తిరుమంగళంలోని రెస్టారెంట్లు, హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయాలని పోలీసులు సూచించారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు... ఈ ప్రాంతంలోని ప్రముఖ హోటల్‌తో పాటు ఏకంగా 40 ఆహారపుశాలల నుంచి ఫుడ్ శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించారు.

అపరాధం చెల్లించేందుకు మన్సూర్‌కు అవకాశం

అడయార్, జనవరి 19: హీరోయిన్ త్రిషపై అనుచిత వ్యాఖ్యలు చేసి వివాదంలో చిక్కుకున్న నటుడు మన్సూర్ అలీఖాన్‌కు కోర్టు విధించిన అపరాధం చెల్లించేందుకు మద్రాస్ హైకోర్టు మరికొంత కాల అవకాశం కల్పించింది. మన్సూర్‌కు విధించిన లక్ష రూపాయల అపరాధాన్ని రెండు వారాల్లో అడయార్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌కు చెల్లించాలని, దీనిపై నివేదిక సమర్పించాలని గత నెల 22న కోర్టు ఆదేశించింది. దీనిపై శుక్రవారం మరో మారు న్యాయమూర్తి సతీష్ కుమార్ సమక్షంలో విచారణ జరిగింది. నిధుల కొరత కారణంగా అపరాధం చెల్లించేందుకు మరో పది రోజుల సమయం కావాలని మన్సూర్ అలీఖాన్ తరపు న్యాయవాది కోర్టును కోరారు. ఆయన విన్నపాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి మరో పది రోజుల సమయం ఇస్తూ, తదుపరి విచారణను వచ్చే నెల 5వ తేదీకి వాయిదా వేసింది.

మెట్రో రైలు ఇంజన్‌కు ముందు భాగంలో డోర్లు

ఐసిఎఫ్, జనవరి 19: డ్రైవర్ లేని రైలింజన్ ముందు భాగంలో ఎమర్జెన్సీ డోర్లు ఏర్పాటు చేయనున్నట్లు మెట్రోరైలు సంస్థ అధికారులు తెలిపారు. అత్యాధునిక సాంకేతిక వసతుల అభివృద్ధికి సీఎంఆర్‌ఎల్ చర్యలు చేపట్టింది. మూడు మార్గాల్లో పనులు పూర్తికాగానే డ్రైవర్ లేని 138 రైళ్లు నడిపేందుకు నిర్ణయించారు. తొలివిడతగా మూడు పెట్టెలు కలిగిన 36 మెట్రోరైళ్ల తయారీకి 'అల్‌స్టోమ్' సంస్థతో సీఎంఆర్‌ఎల్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... నగరంలోని అన్ని ప్రాంతాల్లో 2028 నాటికి మెట్రోరైలు సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రయాణికుల అవసరాలను బట్టి మూడు లేక ఆరు బోగీలతో రైళ్లు నడుపుతామన్నారు. రెండో విడత పథకంలో రైళ్లు నడిపేందుకు కంప్యూటర్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్ సిస్టమ్ అనే పథకాన్ని అమలుపరచనున్నామన్నారు. గంటకు 80 కి.మీ వేగంతో వెళ్లే ఈ రైళ్లను గరిష్ఠంగా 90 సెకన్లకు ఒక రైలు నడపనున్నామని తెలిపారు. ప్రయాణికులు నిల్చునేందుకు స్థలం, సీసీ కెమెరాలు, మొబైల్, ల్యాప్‌టాప్ ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

హస్తకళల ఎగ్జిబిషన్ ప్రారంభం


ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి మాలతి

వేలూరు, జనవరి 19: స్థానిక టౌన్ హాలులో రాష్ట్ర హస్తకళల పరిశ్రమల అభివృద్ధి సమాఖ్య పూంపుహార్, సేలం విక్రయ కేంద్రం ఆధ్వర్యంలో హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభమైంది. ఈ ఎగ్జిబిషన్‌ను జిల్లా రెవెన్యూ అధికారి మాలతి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. 10 రోజులు జరుగనున్న ఈ ఎగ్జిబిషన్‌లో కొనుగోళ్లపై 10 శాతం రాయితీ అందిస్తున్నట్లు, ఈ ఎగ్జిబిషన్ సందర్భంగా రూ.12 లక్షల విక్రయాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు పూంపుహార్ సంస్థ మేనేజర్ నరేంద్ర బోస్, అధికారి హరిహరన్ తెలిపారు.

ఓటరు జాబితా పనులపై కలెక్టర్ సమీక్ష


సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్

వేలూరు, జనవరి 19: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఓటరు జాబితా సవరణల ప్రక్రియపై జిల్లా కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ సమీక్షించారు. ఓటరు జాబితాలో పేర్లు చేర్చడం, తొలగింపు, వివరాల్లో సవరణలు తదితరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, కార్పొరేషన్ కమిషనర్ జానకి రవిచంద్రన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అష్టబంధన మహాకుంభాభిషేకం

వేలూరు, జనవరి 19: స్థానిక ఇడయమ్‌పట్టి ఓటేరిలో ఉన్న మణికంఠన్ అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం అష్టబంధన మహాకుంభాబిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠన్‌కు విశేష అభిషేకం, మహా దీపారాధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు గురుస్వాములు శ్రీనివాసన్, శంకర్ అధ్యక్షతన జరిగాయి. వేడుకల్లో ఇరుముడి కట్టడం, నెయ్యి అభిషేకం, ఆభరణ ఊరేగింపు, జ్యోతి దర్శనం, అయ్యప్పస్వామికి దీపారాధనలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శంకర్, ఏలుమలై, వేల్‌మురుగన్, భాస్కర్, రవిచంద్రన్, బాబు, పెరుమాళ్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిథ్యం
విద్యార్థికి ఆశీస్సులు


విద్యార్థినికి ఆశీస్సులు అందజేస్తున్న పుర ప్రముఖులు

వేలూరు, జనవరి 19: స్థానిక కాట్పాడి ప్రభుత్వ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆదర్శిన్‌శ్రీ షటిల్ కాక్ పోటీల్లో రాణిస్తోంది. ప్రస్తుతం ఆదర్శిని శ్రీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో, ఆమె అభినందన సభ శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో జరిగింది. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, మండల అధ్యక్షురాలు పుష్పలత వన్నియరాజా, కౌన్సిలర్ చిత్రా మహేంద్రన్, ఉప ప్రధానోపాధ్యాయులు మారిముత్తు, టెక్నికల్ విద్య ఉపాధ్యాయులు జనార్దనన్ సహా పలువురు పురప్రముఖులు బాలికను అభినందించి, విజయంతో రావాలని ఆశీస్సులందించారు.

లోక్‌సభ ఎన్నికలకు డీఎంకే సన్నద్ధం
● మూడు కమిటీల ఏర్పాటు

పెరంబూర్, జనవరి 19: రానున్న లోక్‌సభ ఎన్నికలకు అధికార డీఎంకే సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో, ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీ, ఎన్నికల సమన్వయ కమిటీ, కూటమి చర్చల కమిటీలు ఏర్పాటు చేసినట్లు డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ ప్రకటించారు. ఎన్నికల సమన్వయక కమిటీలో మంత్రి ఉదయనిధి, ఎన్నికల నివేదిక తయారీ కమిటీలో చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియకు చోటు కల్పించారు.

ఎన్నికల నివేదిక తయారీ కమిటీ

లోక్‌సభ ఎన్నికల నివేదిక తయారీ కమిటీ డీఎంకే ఎంపీ కనిమొళి నేతృత్వంలో ఏర్పాటైంది. కమిటీలో పార్టీ సమచార శాఖ అధ్యక్షుడు టీకేఎస్ ఇళంగోవన్, వ్యవసాయ విభాగం కార్యదర్శి ఏకేఎస్ విజయన్, ఆస్తుల భద్రత కమిటీ కార్యదర్శి పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్, ఐటీ విభాగం కార్యదర్శి టీఆర్బీ రాజా, వర్తక విభాగం ఉపాధ్యక్షుడు కోవి.చెళియన్, ఎంపీ రాజేష్‌కుమార్, విద్యార్థి విభాగం కార్యదర్శి ఎమ్మెల్యే సీవీఎంపీ ఎళిలరసన్, మేయర్ ప్రియ తదితరులు సభ్యులుగా ఉన్నారు.

అలాగే, లోక్‌సభ ఎన్నికల పనుల సమన్వయం, పర్యవేక్షణ కమిటీ మంత్రులు కేఎన్ నెహ్రూ, ఏవీ వేలు, తంగం తెన్నరసు, ఉదయనిధి స్టాలిన్, పార్టీ అధికార ప్రతినిధి ఆర్ఎస్ భారతి నేతృత్వంలో ఏర్పాటైంది. ఇక, కూటమి పార్టీల సీట్ల సర్దుబాటుకు సంబంధించిన చర్చలకు డీఎంకే కోశాధికారి టీఆర్.బాలు నేతృత్వంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఇ.పెరియస్వామి, కె.పొన్ముడి, ఎంపీలు ఎ.రాజా, తిరుచ్చి శివ, ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం తదితర సభ్యులతో కమిటీ ఏర్పాటైంది. 2019లో పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలోని 39 స్థానాల్లో 38 స్థానాల్లో డీఎంకే, కూటమి పార్టీలు విజయం సాధించాయి. రాబోయే ఎన్నికల్లోనూ ఈ విజయ పరంపర కొనసాగించాలని అధికార డీఎంకే పట్టుదలతో ఉంది.


టి.నగర్ టీటీడీ ఆలయంలో శ్రీరామజన్మభూమి క్షేత్ర ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో గాత్రకచేరీ చేసిన సమీరా భరద్వాజ్ బృందాన్ని సత్కరిస్తున్న స్థానిక సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, సభ్యులు

కొడనాడు ఎస్టేట్‌లో జయకు స్మారక మండపం
● శంకుస్థాపన చేసిన శశికళ


భూమి పూజలో శశికళ

పెరంబూర్, జనవరి 19: నీలగిరి జిల్లా కొడనాడు ఎస్టేట్‌లో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత విగ్రహం, స్మారక మండపం ఏర్పాటుకు సంబంధించిన భూమి పూజ జయ సన్నిహితురాలు కొడనాడు ఎస్టేట్ వాటాదారు శశికళ నేతృత్వంలో శుక్రవారం జరిగింది. నీలగిరి జిల్లాలోని కొడనాడు ఎస్టేట్‌కు దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత, శశికళ, ఇళవరసి, సుధాకరన్ వాటాదారులుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో, గురువారం చెన్నై నుంచి విమానం ద్వారా కోయంబత్తూర్‌కు వచ్చిన శశికళ, అక్కడి నుంచి రోడ్డు మార్గంగా కొడనాడు ఎస్టేట్‌కు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం కొడనాడు ఎస్టేట్ ప్రాంతంలోని కొడనాడు షో పాయింట్‌కు వెళ్లే ప్రధాన రహదారి సమీపంలోని గేట్ నెం.10 వద్ద జయలలిత విగ్రహం, మణిమండపం ఏర్పాటుకు శశికళ నేతృత్వంలో భూమిపూజ జరిగింది. ఈ సందర్భంగా శశికళ మాట్లాడుతూ.. 'నేను ఇప్పటివరకు అమ్మ (జయలలిత) లేకుండా ఒంటరిగా కొడనాడుకు రాలేదు. ఆమె లేకుండా ఒంటరిగా నేను ఎలా వెళ్లాలి. ఏమైనా, కొడనాడు ఆమెకు ఎంతో ఇష్టమైన ప్రదేశం. ఇక్కడ పనిచేస్తున్న వారు మా ఇద్దరికి ఎంతో దగ్గర వారు. ఒక ఇంటి మహిళ ఎలా ఉంటారో కొడనాడుకు వచ్చిన జయలలిత కూడా అలాగే ఉండేవారు' అని అన్నారు. ఇక ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు వీక్షించేలా జయ విగ్రహం, మణిమండపాన్ని పూర్తి చేసి ఆగస్టులో ప్రారంభించనున్నట్లు శశికళ చెప్పారు.

పెరియార్ వర్శిటీ వీసీపై విచారణకు హైకోర్టు స్టే

పెరంబూర్, జనవరి 19: సేలం పెరియార్ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జగన్నాథన్‌పై నమోదైన కేసు విచారణకు హైకోర్టు స్టే విధించింది. తనపై నమోదైన కేసు కొట్టివేయాలని కోరుతూ వైస్ ఛాన్సలర్ జగన్నాథన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ శుక్రవారం విచారణకు రాగా, వీసీ చర్యల్లో నేరపూరిత ఉద్దేశం కనిపించలేదని పేర్కొన్న న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్, తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్కాట్ వీరాసామికి అస్వస్థత
వడపళని ఆసుపత్రిలో చికిత్స



చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డీఎంకే సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ఆర్కాట్ వీరాసామి (92) ఇంట్లో జారి పడి తీవ్రగాయాలతో వడపళని సిమ్స్ ఆసుపత్రిలో చేరారు. గత కొన్నేళ్లుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ ఇంటిపట్టునే వైద్య చికిత్సలందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఆయన ఇంట్లో నడుస్తూ జారి పడ్డారు. దీనితో ఆయన భుజానికి, చేతులకు గాయం కాడంతో లేచి నిల్చోలేకపోయారు. కుటుంబీకులు వెంటనే ఆయన్ను చికిత్స నిమిత్తం వడపళనిలోని సిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యనిపుణులు ఆయనకు స్కాన్ చేసి చూసినప్పుడు ఎముకలు విరిగి నట్లు గుర్తించి ఆ మేరకు చికిత్సలు ప్రారంభించారు.

నడి సముద్రంలో పడవ దగ్ధం
ఆరుగురు జాలర్లకు గాయాలు


దగ్ధమైన ఫైబర్ పడవను పరిశీలిస్తున్న జాలర్లు - ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జాలర్లను పరామర్శిస్తున్న జాలర్ల సంఘం ప్రతినిధులు, కుటుంబీకులు

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా తిరుముల్లైవాసల్ సమీపంలో సముద్రంలో ఫైబర్ పడవ దగ్ధం కావడంతో చేపలవేట సాగిస్తున్న ఆరుగురు జాలర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఆ ప్రాంతంలో పడవలో చేపల వేటకు వెళ్లిన జాలర్లు గాయపడినవారిని ఒడ్డుకు చేర్చి ఆసుపత్రికి తరలించారు. తిరుముల్లైవాసల్‌కు చెందిన అఘోరమూర్తి, ధర్మరాజ్, జీవానందం, మణియరసన్, చిత్తిరైవేల్, పార్తిబన్ అనే ఆరుగురు జాలర్లు ఆనందబాబుకు చెందిన ఫైబర్ పడవలో గురువారం సాయంత్రం సముద్రంలో చేపలవేటకు వెళ్లారు. తీరం నుంచి 20 నాటికల్ మైళ్ల దూరంలో గురువారం అర్ధరాత్రి వీరంతా వలలు విసిరి చేపలు పుడుతుండగా ఫైబవర్ పడవ మోటరు ఇంజన్ నుంచి దట్టమైన పొగలు, మంటలు చెలరేగాయి. క్షణాల్లో పెట్రోలు ట్యాంక్ పేలి నలువైపులా మంటలు వ్యాపించాయి. పడవలో ప్రయాణించిన ఆరుగురు జాలర్లకు నిప్పంటుకుంది. దీంతో ఆరుగురూ పడవనుంచి సముద్రంలోకి దూకారు. అదే సమయంలో ఆ ప్రాంతానికి చేరువుగా మరో పడవలో చేపలుపడుతున్న జాలర్లు వారిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. అనంతరం సీర్గాళి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఫైబర్ పడవ, జీపీఎస్ పరికరం, వాకీటాకీ, ఐస్‌బాక్స్‌లు సహా సుమారు రూ.10లక్షల విలువైన సామగ్రి దగ్ధమైనట్లు జాలర్ల సంఘం నాయకులు తెలిపారు. ఈ సంఘటనపై సముద్రతీర భద్రతా దళం పోలీసులు విచారణ జరుపుతున్నారు.

చెన్నైలో 10 ప్రాంతాల్లో ఐటీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

ప్యారీస్, జనవరి 19: రాజధాని నగరంలో కీల్పాక్కం, కేకే నగర్, ఎలిఫెంట్ గేట్ తదితర 10 ప్రాంతాల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు శుక్రవారం ఉదయం నుంచి కన్వర్‌లాల్ అనే పారిశ్రామికవేత్తకు చెందిన ఇళ్లు, కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కేంద్ర పరిశ్రమల భద్రతా విభాగం బలగాల భద్రత మధ్య ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న రసాయనాలను దేశంలోని పలు రాష్ట్రాలకు కన్వర్‌లాల్ విక్రయిస్తున్నారు. ఆయన దిగుమతి చేసుకుంటున్న రసాయనాలకు సంబంధించి పన్నులు సక్రమంగా చెల్లించడం లేదన్న కారణంగా గత ఏడాది అక్టోబరు నెలలో ఐటీ అధికారులు మూడు రోజులు తనిఖీలు నిర్వహించారు. అప్పుడు లెక్కల్లో చూపని రూ.75 కోట్ల నగదు, మూడు కిలోల బంగారు నగలు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం మళ్లీ చెన్నైలో ఆయనకు సంబంధించిన 10 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. రాజాఅన్నామలైపురం రెండో మెయిన్ రోడ్డులో ఉన్న సుబ్రమణ్యన్ అనే వ్యక్తి ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో కీలక దస్తావేజులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

ఈడీ అధికారుల తనిఖీ...

అశోక్‌నగర్‌లో ఉన్న ఓ ప్రైవేటు సంస్థ సీఈవో ఎస్కే పీటర్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు శుక్రవారం సోదాలు చేపట్టారు. ఆరుగురు అధికారులు సీఐఎస్ఎఫ్ బలగాల భద్రతతో అశోక్‌నగర్ 47వ వీధిలో ఉన్న ఇల్లు, కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా అభిరామపురం 3వ వీధిలో ఉన్న డాక్టర్ సుందర్ నివాసంలో కూడా ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు.

అంతర్జాతీయ స్థాయి వైద్యసేవల్లో రాష్ట్రం ఫస్ట్
● మంత్రి ఎం.సుబ్రమణ్యం

ప్యారీస్, జనవరి 19: అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలందించడంలో రాష్ట్రం ప్రథమస్థానంలో ఉందని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం పేర్కొన్నారు. నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్‌లో కలైంజర్ శతవార్షిక అంతర్జాతీయ మహానాడును మంత్రి శుక్రవారం ఉదయం ప్రారంభించి ప్రసంగించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రజలు ఆరోగ్యంగా జీవించాలన్న ఉద్దేశంతో 'మక్కలై తేడి మరుదువం', 'మక్కలై కాప్పోం' తదితర పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. ఆరోగ్య శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ, డబ్ల్యూహెచ్‌వో శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య స్వామినాథన్, అమెరికా, బ్రిటన్, జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియా, సింగపూర్ తదితర దేశాలకు చెందిన వైద్యనిపుణులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


చెన్నై తేనాంపేట నుంచి సైదాపేట వరకు రూ.621 కోట్లతో నిర్మించనున్న నాలుగు రహదారులతో కూడిన ఫ్లై ఓవర్ నిర్మాణాలను శుక్రవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకేస్టాలిన్ (చిత్రంలో) మంత్రులు ఎం.సుబ్రమణ్యం, ఏవీ వేలు తదితరులు


ఖేలో ఇండియా పోటీల ప్రారంభోత్సవం అనంతరం రాజ్‌భవన్‌కు చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి స్వాగతం పలుకుతున్న గవర్నర్ ఆర్ఎన్ రవి


మదురై జిల్లా వాడిపట్టి తాలూకా, అలంగానల్లూరు సమీపంలోని కీళక్కరై గ్రామంలో 66 ఎకరాల విస్తీర్ణంలో రూ.44 కోట్లతో నిర్మించిన జల్లికట్టు మైదానాన్ని సీఎం స్టాలిన్ ఈ నెల 24వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ స్టేడియానికి కలైంజర్ శతజయంతి జల్లికట్టు మైదానంగా నామకరణం చేశారు.


నయనతార

'అన్నపూరణి' వివాదంపై నయనతార క్షమాపణలు

తాను నటించిన 'అన్నపూరణి' చిత్ర వివాదంపై హీరోయిన్ నయనతార స్పందించారు. ఈ సినిమా హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని విమర్శలు వచ్చాయి. దీనికితోడు నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ నుంచి సినిమాను తొలగించారు. దీంతో నయనతార స్పందించారు. ఈ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టేలా సారీ చెప్పారు. ఈ విషయంపై ఆమె ఇన్‌స్టాగ్రాం వేదికగా గురువారం రాత్రి సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. 'తనకు, తన చిత్రా బృందానికి ఎవరి మనోభావాలనూ దెబ్బతీయాలనే ఉద్దేశం లేదం టూ వివరణ ఇచ్చారు. 'ఓం' చిహ్నం, 'జై శ్రీరామ్' నినాదంతో కూడిన క్షమాపణ లేఖను నయనతార షేర్ చేశారు. సెన్సార్ అనుమతి పొంది గతం లో థియేటర్లలో ప్రదర్శించిన సినిమాని ఓటీటీ నుంచి తొలగిస్తారని తాము ఊహించలేదన్నారు. ఈ సమస్య తీవ్రత అర్థం చేసుకున్నామన్నారు. భగవంతుడిని సంపూర్ణంగా విశ్వసించే వ్యక్తినని, దేశ వ్యాప్తంగా ఉన్న దేవాలయాలను తరచుగా సందర్శిస్తుంటానని ఆమె గుర్తు చేశారు. 'అన్నపూరణి' సినిమా ద్వారా ఎవరి మనోభావాలకైనా బాధ కలిగించివుంటే హృదయపూర్వక క్షమాపణలు కోరుతున్నాని నయనతార పేర్కొన్నారు. కాగా ఈ చిత్రంలో నయనతార సంప్రదాయ బ్రహ్మణ కుటుంబానికి చెందిన అమ్మాయిగా నటించి, మాంసాహారం ఆరగించడమేకాకుండా, రాముడు కూడా మాంసాహారం తినేవాడని, మాంసాహారం తినడం పాపం కాదని ఓ సన్నివేశంలో ఉంది. ఇది పెను వివాదానికి దారి తీసింది. దీంతో ఆమె దిగివచ్చి క్షమాపణలు చెప్పారు.

సత్యరాజ్‌కు దీటుగా నటించాలని ఉంది

● విజయ్ సేతుపతి ● 'సింగపూర్ సెలూన్' ట్రైలర్ విడుదల



నటనలో పోటీపడుతూ, రెండు పాత్రలు సమాన స్థాయిలో ఉండేలా నటుడు సత్యరాజ్‌కు దీటుగా ఒక చిత్రంలో నటించాలన్నదే తన కోరిక అని ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి అన్నారు. ఆర్‌జే బాలాజీ, మీనాక్షి చౌదరి జంటగా, సత్యరాజ్ ముఖ్య పాత్రను పోషించిన చిత్రం 'సింగపూర్ సెలూన్' ఈ నెల 25న విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని, ట్రైలర్ విడుదల వేడుక చెన్నైలో నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయ్ సేతుపతి మాట్లాడుతూ... 'ఈ సినిమా టైటిల్ ఎంతగానో బాగుంది. ఒక టీవీ చానెల్ లోగో తరహాలో ఉంది. ఆర్జే బాలాజీని స్క్రీన్‌పై చూస్తుంటే ఎంతో బాగా ఉంటుంది. నటనలో సత్యరాజ్ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి. ఆయనతో కలిసి సమానమైన పాత్రలలో నటించాలని ఉంది' అని అన్నారు. చిత్ర నిర్మాత ఐసరి కె.గణేశ్ మాట్లాడుతూ... 'నటుడు విజయ్ సేతుపతి కోరికను నెరవేర్చేందుకు నేను సిద్ధంగా ఉన్నా. ఇద్దరు హీరోలు నటించేలా కథలు ఉంటే చెప్పాలని చిత్ర దర్శకుడు గోకుల్‌ను కోరా. కథ సిద్ధంగా ఉంది. విజయ్ సేతుపతి, సత్యరాజ్‌తో కలిసి సినిమా నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నా' అని ప్రకటించారు. హీరో ఆర్జే బాలాజీ మాట్లాడుతూ... 'ఈ చిత్రాన్ని చూసిన మంత్రి ఉదయనిధి కథ నచ్చడంతో విడుదల చేసేందుకు ముందుకు వచ్చారు. అంతేకానీ, ఆయన, నేను బంధువులం కాదు. రెడ్ జెయింట్ మూవీస్ కేవలం కంటెంట్ ఉన్న చిత్రాలను ఎంపిక చేసుకుని విడుదల చేస్తుంది. అలా మా చిత్రాన్ని ఎంపిక చేసింది. ఇంజనీరింగ్ అనేది ఒక కులవృత్తి కాదు.ఎవరైనా చేయొచ్చు. యువత ఉన్నత విద్యను అభ్యసించిన తర్వాత తమకు నచ్చిన రంగంలో రాణించాలని చెప్పేలా ఈ చిత్ర సారాంశం' అని అన్నారు. దర్శకుడు గోకుల్ మాట్లాడుతూ... 'నేను రూపొందించిన గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. అందుకే నాకు ఈ చిత్రం ప్రత్యేకం' అని అన్నారు. కాగా, వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానరుపై నిర్మించిన ఈ చిత్రానికి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ జావెద్ రియాజ్, సంగీతం వివేక్ - మెర్విన్.

'హిట్లర్'గా విజయ్ ఆంటోని

'బిచ్చగాడు'గా ప్రేక్షకులకు పరిచయమైన హీరో విజయ్ ఆంటోని ఇపుడు 'హిట్లర్'గా ప్రేక్షకుల ముందుకు రానున్నారు. రియా సుమన్ హీరోయిన్. గౌతమ్ మీనన్, చరణ్‌రాజ్ ముఖ్య పాత్రలను పోషించారు. రెడిన్ కింగ్స్లీ, వివేక్ ప్రసన్న, దర్శకుడు తమిళ్ తదితరులు నటించారు. నవీన్ కుమార్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేయగా, వివేక్ - మెర్విన్ సంగీతం అందించారు. ధన దర్శకుడు. చెందూర్ ఫిలిమ్ ఇంటర్నేషనల్ బ్యానరుపై నిర్మాత టీ.డీ.రాజా, డీ.ఆర్.సంజయ్ కుమార్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ చిత్రం బృందం చెన్నైలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో హీరో విజయ్ ఆంటోని మాట్లాడుతూ... 'ఈ చిత్రం కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది. రియా సుమన్ స్వీట్ అండ్ సింపుల్. గౌతమ్ మీనన్, తమిళ్‌తో కలిసి నటించడం చాలా సంతోషంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు ధన మాట్లాడుతూ... 'నన్ను నమ్మి ఈ ప్రాజెక్టుకు అప్పగించిన నిర్మాత టీవీ రాజా, నా కథను ఎంచుకున్న విజయ్ ఆంటోనికి ధన్యవాదాలు. ఇందులో ఎంతోమంది గొప్ప నటీనటులు నటించారు. వారివల్లే ఇది కార్యరూపం దాల్చింది. విజయ్ ఆంటోనికి ప్రమాదం జరగడం వల్ల ఆలస్యమైంది. హీరోగా ఒక చిత్రం కోసం ఆయనపడే తపన అమోఘం. హీరోయిన్ రియా సుమన్ ప్రొఫెషనల్. నా గత చిత్రాలకు భిన్నంగా 'హిట్లర్' ఉంటుంది. ఇది ఒక యాక్షన్ థ్రిల్లర్. ప్రేక్షకుడు మంచి అనుభూతిని పొందుతాడు' అని పేర్కొన్నారు. నిర్మాత టీడీ రాజా మాట్లాడుతూ... 'ఈ సినిమా కోసం పనిచేసిన ప్రతి టెక్నీషియన్‌కు ధన్యవాదాలు. విజయ్ ఆంటోని అద్భుతమైన మానవతావాది. తన సొంత చిత్రం కంటే ఎక్కువగా ఈ చిత్రం కోసం శ్రమించారు. అయనకు ధన్యవాదాలు' అన్నారు.


విలేకరుల సమావేశంలో చిత్ర బృందం

ఫిబ్రవరిలో జయం రవి 'సైరన్'

చిత్రజ్యోతి

జయం రవి, కీర్తి సురేష్, అనుపమా పరమేశ్వరన్ నటించిన 'సైరన్' చిత్రం ఫిబ్రవరిలో విడుదలకానుంది. నిజానికి ఈనెల 26న డైరెక్టుగా ఓటీటీలో విడుదల కానుందనే ప్రచారం సాగింది. కానీ, ఫిబ్రవరి 9వ తేదీన విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. జయం రవి నటించిన 'అఖిలన్', 'ఇరైవన్' చిత్రాలు వరుసగా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. ఈ ప్రభావం 'సైరన్'పై చూపింది. విడుదల తేదీపై గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో థియేటర్‌లోనే నేరుగా విడుదల చేసేలా చిత్ర బృందం చర్యలు తీసుకుంది. సముద్రగని, యోగిబాబు తదితరులు నటించిన ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిచగా ఆంటోని భాగ్యరాజ్ దర్శకత్వం వహించారు.


'సైరన్' చిత్రంలో జయం రవి - కీర్తి సురేష్

సేలం మహానాడులో 1,500 డ్రోన్లతో ప్రదర్శన

● మంత్రి కేఎన్ నెహ్రూ


మహానాడు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కేఎన్ నెహ్రూ

ప్యారీస్, జనవరి 19: సేలంలో ఈనెల 21న నిర్వహించనున్న డీఎంకే యువజన విభాగం మహానాడులో 1,500 డ్రోన్లతో బ్రహ్మండమైన ప్రదర్శన నిర్వహించనున్నట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ మంత్రి, డీఎంకే సీనియర్ నేత కేఎన్ నెహ్రూ పేర్కొన్నారు. ఈనెల 21న ఆదివారం సేలం పెద్దనాయకన్ పాళయంలో నిర్వహించనున్న డీఎంకే యువజన విభాగం మహానాడు ఏర్పాట్లపై శుక్రవారం మంత్రి కేఎన్ నెహ్రూ పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... మహానాడు కార్యక్రమాలను 1.25 లక్షల మంది కూర్చొని వీక్షించేలా కుర్చీలు ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా మహానాడు పందిరి లోపల మరో 2.5 లక్షల మంది పాల్గొనేందుకు అవసరమైన వసతులు కల్పించినట్లు తెలిపారు. మహానాడులో పాల్గొనేందుకు పలు ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను జీపీఎస్ విధానంలో విభజించి పార్కింగ్ ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు, తాగునీరు, మరుగుదొడ్ల వసతితో పాటు మహిళలకు ప్రత్యేకంగా విశ్రాంతి గదులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహానాడులో పాల్గొనేందుకు పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ శనివారం సాయంత్రం 5 గంటలకు చెన్నై నుంచి విమానం ద్వారా సేలంకు వస్తారని, నీట్‌ను వ్యతిరేకిస్తూ నిర్వహించనున్న ద్విచక్రవాహన ర్యాలీని ఆయన వీక్షిస్తారని తెలిపారు. మహానాడు తీర్మానాలను రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడల శాఖ మంత్రి ఉదయనిధి ప్రతిపాదిస్తారని మంత్రి తెలిపారు.


కవాతు ప్రదర్శనలో త్రిదళాలు

బీచ్ రోడ్డులో 'గణతంత్ర' రిహార్సల్స్

పెరంబూర్, జనవరి 19: భారత గణతంత్ర వేడుకలకు చెన్నై ముస్తాబవుతోంది. వచ్చే శుక్రవారం జరిగే సంబరాలకు వేదిక కానున్న మెరీనా బీచ్ రహదారిని అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ వేడుకల్లో దేశ ఘనత చాటేందుకు త్రివిధ దళాలతో పాటు రాష్ట్ర పోలీసుశాఖ, అగ్నిమాపక శాఖల రిహార్సల్స్ శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు లైట్ హౌస్ నుంచి యుద్ధ స్మారక చిహ్నం వరకు నిర్వహించిన రిహార్సల్స్‌లో త్రివిధ దళాలు, పోలీసు కవాతు, పోలీసు, సైనిక బ్యాండ్ చోటుచేసుకున్నాయి. అలాగే, గత ఏడాది గణతంత్ర దినోత్సవంలో పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించలేదు. ఈ ఏడాది వేడుకల్లో వీరికి అనుమతి ఇవ్వడంతో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రిహార్సల్ చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా మెరీనా తీరంలో కామరాజర్ రోడ్డులో ట్రాఫిక్ మార్పులు జరిగాయి. మైలాపూర్, రాయపేట మీదుగా వాహనాలను మళ్లించారు. రిహార్సల్స్ జరగనున్న 22, 24 తేదీలు, గణతంత్ర వేడుకలు నిర్వహించనున్న 26వ తేదిన ఈ ట్రాఫిక్ మార్పులు కొనసాగుతాయని పోలీసు శాఖ తెలిపింది.


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

హార్బర్-మధురవాయల్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు ప్రారంభం

ప్యారీస్, జనవరి 19: చెన్నై హార్బర్-మధురవాయల్ మధ్య 20.6 కి.మీ దూరానికి చేపట్టి అనివార్యకారణాల వల్ల తాత్కాలికంగా నిలిపివేసిన ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణపనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఈ పనులను రానున్న రెండేళ్లలో పూర్తి చేయాలని పథకం రూపొందించారు. నగరంలో వాహనాల రాకపోకల వల్ల కలిగే ట్రాఫిక్ సమస్య పరిష్కరింపజేసేలా రాష్ట్రప్రభుత్వం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అవసరమైన ప్రాంతాల్లో ఫ్లై ఓవర్లు ఏర్పాటుచేస్తోంది. హార్బర్ నుంచి పూందమల్లి హైరోడ్డులో ఉన్న మధురవాయల్ వరకు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణపనులను గత 2006వ సంవత్సరం ప్రారంభించింది. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఆ పథకం అటకెక్కింది. ఈ నేపథ్యంలో, గత ఏడాది మే 26న ఈ పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. స్తంభాలపై ఒకే వంతెనగా ఏర్పాటుకానున్న ఎక్స్‌ప్రెస్ హైవే పథకంలో కొంత మార్పులు చేసి రెండు అంతస్తులుగా నిర్మించేందుకు నిర్ణయించారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా 20.6 కి.మీ దూరానికి నాలుగు రహదారులతో నిర్మితం కానున్న ఈ పథకానికి ప్రారంభంలో ప్రణాళిక అంచనా రూ.5,510 కోట్లుగా నిర్ణయించారు. పదకొండేళ్ల అనంతరం లాంగ్స్ గార్డెన్ రోడ్డులో కూవం నది తీరం వెంట వారం రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి. మెరీనా బీచ్ సమీపంలోని నేపియర్ బ్రిడ్జి నుంచి కోయంబేడు వరకు 12.5 కి.మీ దూరానికి రెండంతస్తుల వంతెన ఏర్పాటుకానుంది. శివానంద రోడ్డులో ప్రారంభమయ్యే ఈ వంతెన చింతాద్రిపేట, ఎగ్మోర్, నుంగంబాక్కం, అమింజికరై, అరుంబాక్కం, కోయంబేడు మీదుగా మధురవాయల్ వరకు ఉంటుంది. ఈ ఎక్స్‌ప్రెస్ హైవేలో 13 ప్రాంతాల్లో మలుపులుంటాయని, వాహనాలు రాకపోకలకు అనుకూలంగా, అదే విధంగా హార్బర్ నుంచి మధురవాయల్‌కు లోడుతో బయల్దేరే భారీ వాహనాలకు ప్రత్యేక వసతి కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రిలో 63 యేళ్ల వృద్ధుడికి గ్లకోమా శస్త్రచికిత్స


ముకుందన్‌ను అభినందిస్తున్న డాక్టర్ అశ్విన్ అగర్వాల్

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నేత్ర వైద్య సేవలందించడంతో పేరెన్నికగన్న డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రిలో గ్లకోమాతో బాధపడుతున్న ముకుందన్ అనే 63 యేళ్ల వృద్ధుడికి ఎంఐజీ తరహా శస్త్రచికిత్సను నిర్వహించినట్లు ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అశ్విన్ అగర్వాల్ తెలిపారు. శుక్రవారం ఉదయం శస్త్రచికిత్స చేసుకున్న రోగి ముకుందన్‌ను విలేకరులకు పరిచయం చేశారు. ఈ కొత్త పద్ధతిలో కంట్లో ఒత్తిడిని, మాలిన్యాలను త్వరితగతిన తొలగించే రీతిలో మైక్రో స్టెంట్ అమర్చినట్లు తెలిపారు. ఈ చికిత్సతో రోగి యేళ్ల తరబడి గ్లకోమా నిరోధక కంటి చుక్కలు ఉపయోగించాల్సిన అవసరం ఉండదని చెప్పారు. నలభైయేళ్ల వయస్సు కలిగినవారంతా ముందస్తు కంటి పరీక్షలు చేసుకుంటే గ్లకోమాను నిరోధించవచ్చనని తెలిపారు. గ్లకోమాను సుదీర్ఘకాలం పట్టించుకోకపోతే శాశ్వత అంధత్వం కలుగుతుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఆసుపత్రి క్లినికల్ సర్వీసెస్ హెడ్ డాక్టర్ ఎస్.సౌందరి, డాక్టర్ సుఖప్రియ తదితరులు పాల్గొన్నారు.


జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఖేలో ఇండియా పోటీల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రధాని మోదీకి వివిధ కళారూపాల్లో ఆహ్వానం

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమిదే విజయం

● టీఎన్‌సీసీ ఎన్నికల ఇన్‌ఛార్జి అజయ్‌కుమార్

ప్యారీస్, జనవరి 19: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 నియోజకవర్గాల్లో ఘనవిజయం సాధిస్తుందని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ఇన్‌ఛార్జి అజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఎన్నికల పనుల నిర్వహణకు కొత్త ఇన్‌ఛార్జులను ఏఐసీసీ నియమించింది. కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి ఆ నియమితులైన అజయ్‌కుమార్ రాయపేటలో ఉన్న టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశమయ్యారు. శుక్రవారం టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి తదితర పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... తమిళనాడు సర్వమతాలు, కులాలు, భాషలు, ప్రజలకు కేంద్రంగా విలసిల్లుతోందని, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడే వారు ఇక్కడున్నారన్నారు.

ఆధ్యాత్మిక యాత్రల పేరుతో ఓట్ల వేట

● ప్రధాని మోదీ పర్యటనపై కేఎస్ అళగిరి విమర్శలు

అడయార్, జనవరి 19: ఆధ్యాత్మిక పర్యటన ముసుగులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఓట్ల వేట సాగిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓటమి తప్పదని టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి అభిప్రాయపడ్డారు. గత తొమ్మిదన్నరేళ్ళుగా ప్రధానమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ.. బీజేపీ మేనిఫెస్టోలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. ఈ విషయాన్ని ప్రజలనుంచి దృష్టి మరల్చడానికే అయోధ్యలో రామమందిర నిర్మాణ ప్రారంభోత్సవ ఘట్టాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. చెన్నైలో ఖేలో ఇండియా ప్రారంభోత్సవానికి వచ్చే ప్రధాని మోదీ.. ఆ తర్వాత శ్రీరంగం, రామనాథపురంలకు ఆధ్యాత్మిక పర్యటన చేపట్టనుండడం ఇందులో భాగమన్నారు. ఎన్నికల వేళ ప్రధాని మోదీ ఎన్ని స్టంట్లు వేసినప్పటికీ ఓటమి తప్పదని అళగిరి పేర్కొన్నారు.